ప్రజాశక్తి

ఆదివారం 25 ఫిబ్రవరి 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

తొలి జాబితాలో 12 మందికి చోటు

తెనాలి నుంచి జనసేన అభ్యర్థిగా నాదెండ్ల - ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక పెండింగ్



మంగళగిరిలో టిడిపి శ్రేణుల ఉత్సాహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన నుంచి పోటీచేయనున్న అభ్యర్థుల తొలిజాబితాను ఆపార్టీ అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ శనివారం విడుదల చేశారు. జనసేన నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం తెనాలినుంచి నాదెండ్ల మనోహర్‌ను మాత్రమే ప్రకటించారు. గుంటూరు తూర్పు లేదాపశ్చిమలో కూడా జనసేన పోటీచేయాలని భావిస్తుండగా ఈ అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. అలాగే టిడిపిలో సీనియర్లుగా ఉన్న వారికే ఎక్కువ మందికి ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పటి వరకు



నారా లోకేష్

ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నవారికే తొలి జాబితాలో స్థానం దక్కింది. 2019లో పోటీచేసిన దూళిపాళ్లనరేంద్ర ,తెనాలి శ్రావణ్‌కుమార్, నారా లోకేష్, పత్తిపాట ిపుల్లారావు, జి.వి.ఆంజనేయులు, అనగాని సత్య ప్రసాద్, నక్కాఆనంద్‌బాబుకి అవకాశం దక్కింది. 2019లో జనసేన నుంచిపోటీ చేసిన నాదెండ్లకుకూడాఆపార్టీ మళ్లీ అవకాశం కల్పించింది. అయితే గత ఎన్నికల్లో జిల్లాలో టిడిపి తరుపున పోటీ చేయని రామాంజ నేయులు, బ్రహ్మారెడ్డి, కన్నాలక్ష్మీనారాయణ, వేగశ్న నరేంద్ర వర్మ ఈసారి టిడిపి అభ్యర్థులుగా బరిలో నిలిచారు. పార్టీలో సామాజిక సమీకరణలకు, మహిళలకు ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత దక్కలేదు. వైసిపిఇప్పటికే ముగ్గురు మహిళలకు అవకాశం ఇవ్వగా టిడిపి ఒక్క మహిళను కూడా ఎంపికచేయలేకపోయింది. అలాగే బిసిలకు ప్రాతినిధ్యం పెరగలేదు. రేపల్లేలో సిట్టింగ్ ఎమ్మెల్యేకు మాత్రమే అవకాశం ఇచ్చారు. మాజీ మంత్రులునారా లోకేష్, పుల్లారావు, ఆనంద్‌బాబు మరోసారి ఎన్నికల బరిలో దిగనున్నారు. కేవలం ఎమ్మెల్యే స్థానాలకు మాత్రమే అభ్యర్థుల ఎంపిక జరిగింది. లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాపై ఇంకా స్పష్టత రాలేదు. బిజెపిపొత్తు వ్యవహారం ఇంకా కొలిక్కిరాకపోవడం వల్ల ఎంపి అభ్యర్థుల ప్రకటన జాప్యం జరిగే అవకాశంఉంది. పొత్తు లేకపోతే మార్చి మొదటి వారంలో రెండోజాబితాలో ఐదు నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని భావిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన అభ్యర్థులు

మంగళగిరి - నారా లోకేష్

పొన్నూరు - ధూళిపాళ్ల నరేంద్ర

ప్రత్తిపాడు - బి.రామాంజనేయులు

తాడికొండ - తెనాలి శ్రావణ్ కుమార్

చిలకలూరిపేట - ప్రత్తిపాటి పుల్లారావు

మాచర్ల - జూలకంటి బ్రహ్మనంద రెడ్డి

సత్తెనపల్లి - కన్నా లక్ష్మీనారాయణ

వినుకొండ - జి.వి.ఆంజనేయులు

రేపల్లె - అనగాని సత్యప్రసాద్

వేమూరు - నక్కా ఆనంద్ బాబు

తెనాలి -నాదెండ్లమనోహర్

బాపట్ల -వేగశ్న నరేంద్ర వర్మ



ధూళిపాళ్ల నరేంద్ర



జీవీ ఆంజనేయులు



నాదెండ్ల మనోహర్



ప్రత్తిపాటి పుల్లారావు



బి రామాంజనేయులు



తెనాలి శ్రావణకుమార్



జూలకంటి బ్రహ్మారెడ్డి



కన్నా లక్ష్మీనారాయణ

ఆరు చోట్ల అసంతృప్తి!

తొలిజాబితాల్లో దక్కని చోటు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలోని టిడిపి నాయకులలో అసంతృప్తి గూడుకట్టుకుంది. గుంటూరు తూర్పు, పశ్చిమ, నర్సరావుపేట, గురజాల, తెనాలి, పెదకూరపాడులో ఇన్‌ఛార్జిలకు చోటు దక్కక పోవడంపై ఆయా ప్రాంతాల్లో అసంతృప్తికి దారితీసింది. శనివారం ప్రకటించిన టిడిపి, జనసేన ఉమ్మడి జాబితాపై సీనియర్ నాయకులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, యరపతినేని శ్రీనివాసరావు అసంతృప్తిగా ఉన్నారు. తెనాలిలో తనకు కాకుండా జనసేన నుంచి నాదెండ్ల మనోహర్‌కు అవకాశం ఇవ్వడంపై ఆలపాటి అసంతృప్తిగా ఉన్నారు. పొత్తులో తెనాలిలో అవకాశం ఇవ్వకపోతే ఆలపాటికి ప్రత్యామ్నాయంగా మరొక చోట అవకాశం కల్పించలేదు. దీనిపై ఇంతవరకు స్పష్టత లేదు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని సంకేతాలు ఇస్తున్నా అధిష్టానం ఇంతవరకు ఎటువంటి హామీ ఇవ్వలేదు. టిక్కెట్లు దక్కని వారికి పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సముచిత స్థానం కల్పిస్తామని చెబుతున్నా ఎంత వరకు కార్యరూపం దాల్చుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. నాదెండ్ల అభ్యర్థిత్వం రెండు నెలల క్రితం పవన్ కల్యాణ్ ప్రకటించారు. అప్పటి నుంచి ఆలపాటి అసంతృప్తి గళం విప్పుతున్నారు. అయినా ఇప్పటివరకు ప్రత్యామ్నాయంపై స్పష్టత ఇవ్వలేకపోయారు. అలాగే తొలి జాబితాలో చోటు ఉంటుందని భావించిన గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు పేరు ఖరారు కాకపోవడంపై కూడా ఆయన అసంతృప్తిగా ఉన్నారు. నర్సరావుపేట సిట్టింగ్ ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు వైసిపికి రాజీనామా చేసి ఈనెల 26న టిడిపిలో చేరుతున్న నేపథ్యంలో యరపతినేని పేరు పెండింగ్‌లో పెట్టారు. లావు శ్రీకృష్ణ దేవరాయులు గురజాలకు వైసిపి ఎమ్మెల్సీ జంగా పేరును ప్రతిపాదించారు. లావుతోపాటు జంగా కూడా టిడిపిలో చేరనున్నారు. జంగాకు గురజాల టిక్కెట్ ఇచ్చి నరసరావుపేటలో యరపతినేనికి అవకాశం ఇవ్వాలని లావు ప్రతిపాదించారు. దీంతో గురజాల టిక్కెట్ పెండింగ్‌లో పడింది. వైసిపి నర్సరావుపేట లోక్‌సభకు నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను ఎంపిక చేయడంతో సామాజిక సమీకరణలో జంగాకు అవకాశం ఇవ్వాలని ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీంతో 1995 నుంచి పార్టీలో చురుగ్గా ఉన్న యరపతినేనికి మొదటి జాబితాలోనే పేరు ఉంటుందని భావించినా తాజాగా వైసిపి నాయకులు టిడిపిలో చేరిక వ్యవహారం ఆయనకు ఇబ్బందికరంగా మారింది. మరో వైపు నర్సరావుపేటలో ఐదేళ్లుగా ఇన్‌ఛార్జిగా ఉన్న చదలవాడ అరందబాబు పేరు కూడా తొలిజాబితాలో లేదు. ఆయన కూడా మనస్తాపంకు గురయ్యారు. అరవిందబాబు ఐదేళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని వైసిపిపై రాజీలేని పోరాటాం చేస్తున్నా ఒక వర్గానికి చెందిననాయకులు తమకే అవకాశం ఇవ్వాలని పట్టు బట్టడం వల్ల ఈ స్థానం కూడా పెండింగ్‌లో ఉంది. గుంటూరు తూర్పు, పశ్చిమ, పెదకూరపాడు, నర్సరావుపేట, గురజాల స్థానాల్లో ఇన్‌ఛార్జిలను కాదని కొత్త వారికి అవకాశం ఇవ్వాలన ప్రతిపాదనపై ఐదు నియోజకవర్గాల నాయకులు అసంతృప్తిగా ఉన్నారు. గుంటూరులోని రెండుసీట్లకు సంబంధించి బిజెపి,జనసేన

2 లో

నేడు గ్రూప్-2 పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గుంటూరు జిల్లాలో 56 పరీక్షా కేంద్రాల్లో 28,209 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు ఉదయం 9.30 నుండి 10 గంటల లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. గ్రేస్ పీరియడ్ 15 నిమిషాలు కలిపి, ఉదయం 10.15 గంటలలోపు వచ్చిన అభ్యర్థులను మాత్రమే పరీక్షకు అనుమతిస్తారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం పరీక్షా కేంద్రంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో సీటింగ్ ఏర్పాట్లు చేశారు. చేయడం జరిగిందన్నారు. పరీక్ష హాళ్ళలో సిసి కెమెరాల ఏర్పాటు చేశారు. అభ్యర్థులు పరీక్ష హాల్‌లోకి ఎలాంటి సెల్‌ఫోన్లు, వాచ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలను తీసుకెళ్లకూడదు. పరీక్ష ముగిసే వరకు అనగా మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష హాల్‌లోనే వుండాలి. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఒరిజనల్ ఫోటో గుర్తింపు కార్డు (పాస్ పోర్టు , పాన్ కార్డు , ఓటర్ ఐడి , డ్రైవింగ్ లైసెన్స్ మొదలైనవి) లను పరీక్షా కేంద్రాల వద్ద అధికారులకు చూపించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (0863-2234014) ఏర్పాటు చేశారు.

పరీక్షా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.ఎస్.జవహర్‌రెడ్డి కి తెలియజేశారు. శుక్రవారం విజయవాడలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్యాంపు కార్యాలయం నుండి జవహర్‌రెడ్డి గ్రూప్ 2 పరీక్షలు, రెవెన్యూ , మూడవ విడత రీసర్వే,

2లో

జనన, మరణ ధ్రువీకరణ జారీ సులభతరం

జిజిహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

2లో

నీటి కాలుష్యంపై వీడని నిర్లక్ష్యం

వీక్షణం

8లో



మాట్లాడుతున్న పాశం రామారావు

(వార్త మెయిన్‌లో)

రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించండి

సింహాద్రి శివారెడ్డి వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు

ఆశాల సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-తాడికొండ


మాట్లాడుతున్న నేతాజీ

దీర్ఘకాలంగా ఆశా వర్కర్లు డిమాండ్ చేస్తున్న సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్ష లు వై. నేతాజీ పేర్కొన్నారు. శనివారం తాడికొండ మండలం పొన్నెకల్లు పీహెచ్సీ పరిధిలోని ఆశా వర్కర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆశా వర్కర్లకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ప్రభుత్వం మంజూరు చేసిందని పనిచేస్తూ మరణించిన వారికి మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇవ్వటానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. పదవి విరమణను 60 సంవత్సరాలను నుంచి 62 సంవత్సరాలకు పెంచెందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. రూ. 6లక్షల ప్రమాద బీమా కల్పించనుం దన్నారు. ఇంకా అనేక రకాల డిమాండ్లను పరిష్కరించటానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. జ్యోతి, సీఐటీయూ నాయకులు గాంధీ రామ్మోహనరావు. ఆశా వర్కర్లు తదితరలు పాల్గొన్నారు.

పరీక్షా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

ఇనాం అండ్ అసైన్డ్ భూములు, పేదలందరికీ ఇళ్ళ పథకం ఇళ్ళ నిర్మాణాలు, హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్, ఎన్ఆర్ ఈజిఎస్, కరువు మండలాల్లో తాగునీరు , ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం, ఆరోగ్యం, వైద్యం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జేసీ జి.రాజకుమారి, డీఆర్ఓ పెద్దిరోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజులు పనిదినాలు కల్పించడం జరుగుతుందని, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పూర్తి అయిన భవనాలకు విద్యుత్, వాటర్ సౌకర్యాలు కల్పించి సంబంధిత అధికారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో కార్యక్రమంలో సిపిఓ శేషశ్రీ, ఎస్.ఇ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య, ఎస్.ఇ ఆర్ డబ్ల్యు ఎస్ సురేష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరు చోట్ల అసంతృప్తి!

(మొదటిపేజీ తరువాయి)

పొత్తుల వ్యవహారంలో తుది నిర్ణయాలు వెలువడిన తరువాతనే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని భావిస్తున్నారు. అందువల్లే గుంటూరు తూర్పు, పశ్చిమ పెండింగ్‌లో పడ్డాయి. పెదకూరపాడులో రియల్టర్ భాష్యం ప్రవీణ్‌ను ఎంపిక చేయాలని నారా లోకేష్ పట్టుబడు తున్నారు.నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉన్న తమకే అవకాశం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ వర్గీయులు పట్టుబడుతున్నారు.గత వారం రోజులుగా కొమ్మాలపాటి వర్గం అన్ని ప్రాంతాల్లో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తోంది. శ్రీధర్‌కు తిరిగి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివి ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థునిలు 167 మందికి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ సంస్థ శనివారం స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేసింది. స్థానిక మాజేటి రామ్ కళ్యాణ్ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్ర, రాజ మండ్రి డిఎస్పి, టీవీ.రత్నస్వామీ విద్యార్థులకు స్కాలర్షిప్ల అందజేశారు. రవీంద్ర మాట్లాడుతూ రానున్న సమాజంలో మీ భవిష్యత్తునీ మీరే తీర్చిదిద్దుకోవాలన్నారు. రత్నస్వామి మాట్లాడుతూ ఆడపిల్లలను ప్రోత్సహించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ సంస్థ కృషి అభినందనీయమని అన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివే చదువు సమాజానికి ఉపయోగపడుతుందని అన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ సంస్థ స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్ లు మాట్లాడుతూ గుం టూరు నలుమూలల నుండి విచ్చేసిన విద్యార్థినిలు మల బార్ గ్రూప్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈ స్కాల ర్షిప్ల పంపిణీ చేశామని అన్నారు. పేద, ప్రతిభ కలిగిన 167 మందికి పైగా విద్యార్థినీలకు రూ. 14.78 లక్షలు అందించామన్నారు.

టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా మనోహర్

అధిష్టానం ప్రకటనతో కార్యాలయం వద్ద అభిమానుల సందడి

ప్రజాశక్తి తెనాలి

రానున్న ఎన్నికలలో టిడిపి, జనసేన ఉమ్మడి పోరులో ఎట్టకేలకు తెనాలి అసెంబ్లీ స్థానం నాదెండ్ల మనోహర్ దక్కించుకున్నారు. తాడేపల్లి లో శనివారం సమావేశమైన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. జనసేన మొత్తంగా 24 స్థానాల్లో పోటీ చేస్తుండగా తొలి ఐదు స్థానాలను పవన్ కళ్యాణ్ ప్రకటించారు. వాటిలో జిల్లా నుంచి ప్రకటించిన ఒకే ఒక్క స్థానం తెనాలి. తెనాలి అసెంబ్లీ స్థానానికి నాదెండ్ల మనోహర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. టిడిపి నుంచి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెనాలి స్థానం దక్కించుకునేందుకు విశ్వప్రయత్నం చేశారు. అయితే జిల్లాలో గుంటూరు-2లో ఆలపాటికి అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. మరి ఆలపాటి నిర్ణయం ఎలా ఉంటదన్నది వేచి చూడాల్సిందే. మనోహర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన వెంటనే టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ ద్వితీయశ్రేయ నాయకులు సమావేశం అయ్యారు. భవిష్యత్ కార్యాచరణ పై అంతర్గతంగా చర్చించారు. ఐటీడీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం విజయ్ కుమార్, అలాగే తెనాలి కొల్లిపర మండలాల ఐటీడీపీ నాయకులు ఆలపాటికి సీటు దక్కకపోవడాన్ని నిరసిస్తూ రాజీనామాకు సిద్ధమైనట్లు ప్రకటించారు. ఇక వైసిపి విషయానికొస్తే ప్రస్తుతానికి సిట్టింగ్ ఎమ్మెల్యేకే అవకాశం అన్న దీమాలో ఆ పార్టీ శ్రేణులు ఉన్నారు. అయితే తాజాగా కాపు సామాజిక వర్గానికి చెందిన దాసరి కిరణ్ కుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఏది ఏమైనా టిడిపి జనసేన ఉమ్మడి పోరులో తెనాలి సీటు పై నెలకొన్న ఉత్కంఠతకు ఆయా పార్టీల అధినాయకులు తెరదించారు. ఈ నేపథ్యంలో స్థానిక బోస్ రోడ్ లోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు సంబరాలు చేస్తున్నారు. టిడిపి, జనసేన ఐక్యత వర్ధిల్లాలని, జిందాబాద్ నాదెండ్ల మనోహర్ అంటూ నినాదాలు చేశారు. అభిమానులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దివ్వెల మధుబాబు, నాయకులు హరిదాస్ గౌరీ శంకర్, ఇస్మాయిల్ భేగ్, కాలేషా, పి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


జనసేన కార్యాలయం వద్ద టిడిపి, జనసేన నాయకులు

లోకేష్‌కు టికెట్ కేటాయించడంపై హర్షం

ప్రజాశక్తి మంగళగిరి

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ సీటు టిడిపి తరపున నారా లోకేష్ కు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రకటించడం పట్ల మంగళగిరిలో టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. 50,000 మెజార్టీతో గెలిపిస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, దామర్ల రాజు, నందం అబద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్ :తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ మంగళగిరి అభ్యర్థిగా శనివారం ఉదయం టిడిపి, జనసేన అధినాయకులు తొలి జాబితాను ప్రకటించడంతో, ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి తెలుగుదేశం మండల కార్యాలయం వద్ద టిడిపి, జనసేన నాయకులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి, హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో 27 సంక్షేమ పథకాలను నారా లోకేష్ అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, టిడిపి నాయకులు కానుగోలు కోటేశ్వరరావు, చిగురుపాటి సుబ్బారావు, శంకర శెట్టి పిచ్చయ్య, కంచర్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో




అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రామాంజనేయులు

ప్రజల మద్దతుతో గెలుస్తాను

ప్రత్తిపాడు టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి రామాంజనేయులు

ప్రజాశక్తి ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ బూర్ల రామాంజనేయులు ప్రకటించిన సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం కేంద్రంలోని నందమూరి తారక రామారావు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరియు డాక్టర్ బాబు జగజ్జీవన్ రావు విగ్రహాలకు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ - జనసేన పార్టీ ఉమ్మడి సమావేశంలో ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో తనకు చోటు కల్పించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మద్దతుతో గెలుస్తామన్నారు.

పొన్నూరు అభ్యర్థిగా ధూళిపాళ్ల

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను ప్రకటించినందుకు టిడిపి నాయకులు హర్ష వ్యక్తం చేశారు. శనివారం పొన్నూరు ఐలాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. పొన్నూరు టికెట్ ధూళిపాళ్ళ నరేంద్ర కు వరుసగా 7వ సారి రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారుజ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ 2019లో ఓడినా ప్రజల మధ్యే ఉంటూ పొన్నూరులో వైసీపీ అరాచకాలు, దోపిడీలపై రాజీలేని పొరాటం చేస్తున్న నరేంద్ర కుమార్ వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టినా, సంగం డెయిరీని టార్గెట్ చేసి వేధింపులకు గురిచేసినా పాడిరైతులు, ప్రజల కోసం ధైర్యంగా నిలబడ్డ 2024లో ధూళిపాళ్ళను భారీ మెజారిటీ తో గెలిపించుకుంటామని టిడిపి నాయకులు తెలిపారు.

పొన్నూరులో



జనన, మరణ ధ్రువీకరణ జారీ సులభతరం

జిజిహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సులభంగా పొందడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. శనివారం జనన మరణ ధ్రువీకరణ కేంద్రం సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ తో జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు జనన మరణ ధ్రువీకరణ పత్రాలను పొందాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నామని, నోటరీ చేయించాలని, ఇద్దరి గజిటెడ్ అధికారులతో సంతకాల చేయించాలని ఆదేశించడం వల్ల వూరు గాని వూరులో అధికారులు సంతకాల కోసం పరుగులు పెట్టాల్సి వస్తుందని బాధితులు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సమస్యల పై చెక్ పెట్టేందుకు వివిధ విభాగాలతో సమీక్ష చేశామని ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. జనన మరణ ధ్రువీకరణ పత్రాల కోసం వూరు.. పేరు.. వయస్సు , చిరునామా ల కు సంబంధించి తప్పుల తడకగా కుటుంబ సభ్యులకు అందచేస్తున్నారని దీనివల్ల వారికి పెద్ద ప్రహసంగా మారిందని అయన చెప్పారు. ప్రతి జనన , మరణ నమోదు పత్రాల తో పాటు ఆధార్ కార్డు, జిరాక్స్ కాపీ ని సమర్పించాలన్నారు. నమోదు చేసే సిబ్బంది జాగ్రత్తతో ఆధార్ కార్డులో ఉన్న సమాచారాన్ని తప్పులు దొర్లకుండా టైప్ చేయాలన్నారు. జనన మరణ ధ్రువీకరణ పత్రాలు ప్రింట్ తీయక ముందే ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయకముందే వాట్స్ అప్ ద్వారా బాధితుల కుటుంబాలకు సెల్ ఫోన్ లో వాట్స్ అప్ కు పంపించాలి. వారికి ఈవిధంగా పత్రం అందచేస్తున్నామని చెప్పి వారి వద్ద నుంచి అనుమతి పొందాలన్నారు. ఆ తర్వాత ప్రింట్ తీసి ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసి బాధితుల సహాయకులకు అందించాలని ఆయన సూచించారు. దానికి సంబంధించి వాట్స్ అప్ గ్రూప్ ను ఏం ఆర్ డి సిబ్బంది సిద్ధం చేయాలనీ ఆయన చెప్పారు. దీని ద్వారా సమాచారాన్ని కరెక్ట్ గ పొంది ఆ తర్వాత కుటుంబ సభ్యులకు సరైన సమాచారం ఇవ్వడానికి అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. దీనివల్ల రోగులకు వారి సహాయకులకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. దీనివల్ల ఆసుపత్రికి వచ్చే రోగులకు గాని వారి సహాయకులకు నోటరీ, జిరాక్స్ సమస్యల నుంచి దూరంగా ఉండటానికి అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు. తప్పులు దొర్లినప్పుడు .. చనిపోయిన వ్యక్తి గాని జననం పొందిన వారి పేర్లు తప్పులుగా దొర్లినా , స్పెల్లింగ్ విషయం లో కూడా తప్పులు జరిగిన నోటరీ చేయించాలని వారి పై వత్తిడి పెంచవద్దని ఆయన సూచించారు. ఎలాంటి పరిస్థితి వచ్చినప్పుడు వాటిని పరిశీలన చేసేందుకు సి యస్ ఆర్ ఎం ఓ కు బాధ్యతలు అప్పగించినట్లు ఆయన చెప్పారు. ఇద్దరు గజిటెడ్ అధికారుల సంతకం కోసం ఆసుపత్రి లో డ్యూటీ అసిస్టెంట్ ఆర్ ఏం ఓ ల చేత సంతకాలు చేస్తే సరిపోతుందని ఆయన తెలిపారు. వీరంతా సంతకాలు పెట్టిన తర్వాత ధ్రువీకరణ పత్రలను అందచేయాలని ఆయన సూచించారు.

బస్సు, లారీ ఢీ : డ్రైవర్లకు గాయాలు

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల పట్టణ సమీపంలోని నర్సరావుపేట రహదారి వద్ద శనివారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. మాచర్ల నుండి నర్సరావుపేట వైపుకు వెళ్ళుతున్న లారీ, నెల్లూరు నుండి మాచర్ల వైపు వస్తున్న ఆర్‌టిసికి చెందిన ఇంద్రా బస్సు ఎదురెదురుగా ఢీకోనటంతో రెండు వాహనాలను నడుపుతున్న డ్రైవర్లకు తీవ్రగాయాలైనాయి. లారీ డ్రైవర్ బోక్కసం సాంబకు రెండు కాళ్ళు నుజ్జు నుజ్జు కాగా, బస్సు డ్రైవరు దీరం వెంకటరావుకి ఒక కాలు విరిగింది. లారీ డ్రైవరును అతి కష్టం మీద నుజ్జు నుజ్జు అయిన లారీ ఎదురు భాగం నుండి తీయటం జరిగింది. బస్సుకు కూడ డ్రైవరు వైపు ఎదురు భాగం బాగా దెబ్బతిన్నది. వారి ఇరువురిని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రధమ చికిత్స , అనంతరం మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేటకు తరలించారు. ఆర్‌టిసి బస్సు పొదిలి డిపోకు చెందిందని పోలీసులు తెలిపారు. బస్సులో కొందరు ప్రయాణీకులకు స్వల్పంగా గాయాలైనాయి. మాచర్ల రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక రెవెన్యూ పౌర సరఫరాల శాఖ అధికారులతో కలసి కాకాని రోడ్డు లో "రామారావు చికెన్ సెంటర్, శ్రీనివాస ఫుడ్ కోర్టు లపై దాడి చేసి గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. వాణిజ్య అవసరముల నిమిత్తం రెస్టారెంట్ లో గృహ అవసరములకు సంబంధించిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్ లను వినియోగిస్తున్నట్టు కనుగొని 9 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్టు సిఐ ఎన్.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. నిర్వహాకులు మల్లంపాటి రామారావు, కలిసెట్టి మహేష్ లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



85 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

చట్ట విరుద్ధంగా అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు సెబ్ అడిషనల్ ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు హెచ్చరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి వద్ద నుండి 85 మద్యం బాటిళ్లు మరియు ద్విచక్ర వాహనం ను స్వాధీనపరచుకున్నట్లు సబ్ ట్రెడిషనల్ ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని అన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సెబ్ సిఐ సుకన్య మరియు సిబ్బందిని అభినందించారు.

'సెయింట్ జోసెఫ్'లో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



చిన్నారిని అభినందిస్తున్న శిబి అబ్రహం

నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న సెయింట్ జోసెఫ్ హై స్కూల్‌లో శనివారం ఘనంగా సైన్స్, ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వ హించారు. రెండురోజుల పాటు జరగనున్న ఈ ఫెస్టివల్‌లో మొదటి రోజైన శనివారం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా 1 నుండి 10 వ తరగతి విద్యార్థులు తమకు ఇచ్చిన సైన్స్ ప్రాజెక్ట్‌లలో రూపొందించిన ఆవిష్కరణలతో పాల్గొన్నారు. మరి కొంత మంది విద్యార్థులు ఫుడ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. పాఠశాల ముందు ఇస్రో పేరుతో ఏర్పాటు చేసిన పెద్ద శాటిలైట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా డైరెక్టర్ శిబి అబ్రహం మాట్లా డుతూ చిన్నారులలో సరికొత్త ఆలోచనల రూపకల్ప నకు నైపు ణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు తమ లోని నైపుణ్యాలను తెలుసు కొని అభ్యాసనం చేయడం ద్వారా లక్ష్య సాధనకు మార్గం సుగ మం అవుతుందన్నారు. డైరెక్టర్ ప్రకాష్ చాకోమ విద్యార్థుల ప్రాజెక్టులను, ఫుడ్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. విద్యార్థులను అభినందించారు.

వైద్య సిబ్బంది వేతన సమస్యల పరిష్కారానికి 27న గ్రీవెన్స్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఈ నెల 27న గ్రీవెన్స్ డే నిర్వహించ నున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో పల్నాడు జిల్లా పరిధిలో పనిచేసే ఉద్యోగులలో ఎవరికైనా జీతాలకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లయితే ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.



మధుసూదనరావును సత్కరిస్తున్న పోలీసు సిబ్బంది

ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై పోలీసులకు శిక్షణ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియ నియమావళిపై న్యాయ నిపుణులు, సీనియర్ పోలీసు అధికారులచే పోలీసు సిబ్బందికి పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయ నిపుణులు, సీనియర్ పోలీసులచే శిక్షణను అందించడం జరిగింది. ఈ సందర్భంగా డిడి మధుసూదనరావు, ప్రముఖ న్యాయవాది బి. నరసింహారావు, జిల్లా డిఎల్‌ఎంటి వి. వెంకటరెడ్డి, అచ్చంపేట సీఐలు షేక్. కరీముల్లా షావలి, ఏవీ. బ్రహ్మం, ఏ. అశోక్ కుమార్, వీరాంజనేయులు పోలీసులకు వివిధ అంశాలపై శిక్షణను ఇచ్చారు. ముఖ్యంగా ఐపిసి, సిఆర్పిసి, ప్రజా చట్టం 1951, తదితర చట్టాలు గురించి వివరించారు. ఎన్నికలకు సంబంధించి చేయాల్సిన, చేయకూడని పనులపై అవగాహన కల్పించారు. అధికారులు తమ ప్రవర్తనా నియమావళి, నిబంధన గురించి వివరణ ఇచ్చారు. క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పిచారు.

రైతు సమస్యలపై పోరాడిన సింహాద్రి శివారెడ్డి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సిపిఎం గుంటూరు జిల్లా నేతల్లో ఒకరైన సింహాద్రి శివారెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక పండరీపురంలోని సిపిఎం కార్యాలయంలో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ కె. ఎస్. లక్ష్మణరావు పాల్గొన్నారు. కార్యక్రమానికి సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. శివారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ రైతు సమస్యలపై పోరాడిన శివారెడ్డి అనేక ఉద్యమాలు జరిపారని, ప్రజా సంఘాల అభివృద్ధి, రైతు సమస్యలపై, వ్యవసాయం తదితర అంశాలపై ఆయన కృషి చేశారన్నారు.

ఉమ్మడి జిల్లాలో పార్టీ నిర్మా ణంలో, ప్రజా సంఘాల నిర్మాణంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారన్నారు. రాధాకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం, రైతు పోరాటంలో పలుమార్లు దాడులకు భౌతిక దాడులకు గురైన వ్యక్తి శవారెడ్డి అని అన్నారు శివారెడ్డి తనకు 86 ఏళ్ల వయ సులో కూడా రైతు సమస్యల గురించి, ఉద్యమాల గురించి తప్ప వేరే మాట్లాడే వ్యక్తి కాద న్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ కాజా, మంగళగిరి, సత్తెనపల్లి తదితర ప్రాంతాల్లో, గ్రామాల్లో రైతులు, రైతు కూలీలు పడుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి శివారెడ్డి అని కొనియాడారు. రైతు సంఘాల నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో కర్నూల్ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఆంజనేయులు నాయక్, హనుమంతరెడ్డి, గుంటూరు మల్లేశ్వరి, చిలకలూరిపేట కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు బి. మహేష్ పాల్గొన్నారు



సింహాద్రి శివారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎం. రాధాకృష్ణ తదితరులు

సత్తెనపల్లి, వినుకొండ, మాచర్లలో టిడిపి శ్రేణుల సంబరాలు

- తొలి జాబితాలో కన్నా లక్ష్మీనారాయణ, జివి ఆంజనేయులు, బ్రహ్మారెడ్డి పేర్లు ప్రకటించడంపై హర్షం
- సత్తెనపల్లి సీటు గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తా: కన్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



సత్తెనపల్లి అసంబ్లీ సీటు గెలిచి టిడిపి అధి నేత చంద్రబాబు నాయు డుకు నారా లోకేష్ కు గిఫ్ట్ గా ఇస్తానని సత్తెనపల్లి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కన్నా లక్ష్మీ నారాయణ వెల్లడించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా కన్నా పేరును ప్రకటించారు. ఈసందర్భంగా సత్తెనపల్లి రఘురాం నగర్ లోని కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు చంద్రబాబుకు,పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముప్పాళ్ళ మండలం తొండపిలో టిడిపి జెండా దిమ్మెను ధ్వంసం చేయటం దుర్మాగ్గమని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా కన్నా లక్ష్మీనారాయణ ను ఖరారు చేసిన నేపథ్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టిడిపి కార్యా లయం వద్ద టిడిపి నాయకులు కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు జరుపు కున్నారు.



సత్తెనపల్లిలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

చంద్రబాబుకు పాలాభిషేకం

ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండ నియోజకవర్గ టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జీవి ఆంజనేయులు పేరు ప్రకటించడంతో నియోజకవర్గంలోని ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి కార్యాలయంలో చంద్ర బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి శమేమ్ ఖాన్, టిడిపి నాయకులు మీసాలు మురళీకృష్ణ యాదవ్ మాట్లా డుతూ అరాచక వైసిపి పాలనకు చరమ గీతం పాడేందుకు వినుకొండ నియో జకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి జీవి ఆంజనేయులుని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు టిడిపి-జనసేన శ్రేణులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు అయుబ్ ఖాన్, ముంద్రు సుబ్బారావు, సౌడగార్ జాని బాషా, గోరంట్ల హనుమంతరావు పాల్గొన్నారు.



వినుకొండ టిడిపి కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కార్యకర్తలు మరో రెండు నెలలు అప్రమత్తంగా ఉండాలి

జూలకంటి బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి- మాచర్ల

బానిసత్వం, దోపిడిల నుండి ప్రజలను కాపాడేందుకు తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు మరో రెండు నెలల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా పని చేయాలని తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జీ జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. తొలి జాబితాలో తన పేరు ప్రకటించటంపై బ్రహ్మారెడ్డి స్పందిస్తూ చంద్రబాబుకు తన మీద ఉన్న నమ్మకం, ప్రేమ, అభిమానమే కారణమన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ఉన్న ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కొని కార్యకర్తలు, నాయకులు గత రెండేళ్లుగా పార్టీ బలోపేతానికి కృషి చేశారని అన్నారు. తమ నాయకులు గత రెండేళ్లుగా ప్రజల పక్షాన పోరాడిన తీరును గుర్తుచేశారు. ఇదే ఒరవడితో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు మరో రెండు నెలల్లో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వరకు అత్యంత అప్రమత్తంగా ఉంటూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు పని చేయాలన్నారు. సమావేశంలో నాయకులు కొమెర దుర్గారావు, మదార్‌సాహెబ్, విద్యాధరణి మురళి, గుండాల శ్రీనివాసరావు, కంభంపాటి అనిల్‌కుమార్, అమర్, వజ్రం నాయక్, మాచర్ల వాసు, కొమెర శివ తదితరులు పాల్గొన్నారు.



మాచర్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి బ్రహ్మారెడ్డి

ఎమ్మెల్యే ఎన్నికల బరిలోకి ఏడోసారి జూలకంటి కుటుంబం

ప్రజాశక్తి-రెంటచింతల: తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ సీఎం చంద్రబాబు నాయుడు శనివారం ప్రకటించిన ఎమ్మెల్యేల అభ్యర్థుల జాబితాలో మాచర్ల నుంచి పోటీ చేయడానికి జూలకంటి బ్రహ్మారెడ్డికి అవకాశం దొరికి అధికారికంగా పేరు ప్రకటించటం మండల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. బ్రహ్మారెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇది మూడవసారి. వారి తల్లిదండ్రులు నాలుగు సార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. బ్రహ్మారెడ్డి తండ్రి జూలకంటి నాగిరెడ్డి 1967లో సాధారణ ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 72 ఓట్లతో ఓడిపోయారు. ఆ తరువాత 1972లో ఇండిపెండెంట్ గా పోటీ చేసి 11,701 ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి 1983లో గురజాల నియోజకవర్గం నుంచి పోటీ చేసి కాసు వెంకట కృష్ణారెడ్డి పై 12,710 ఓట్లతో గెలుపొందారు. ఆ తరువాత 1999 ఎన్నికల్లో జూలకంటి నాగిరెడ్డి సతీమణి దుర్గాంబ మాచర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసి పిన్నెల్లి లక్ష్మారెడ్డి పై గెలుపొందారు. 2004,2009 ఎన్నికల్లో బ్రహ్మారెడ్డి. పిన్నెల్లి లక్ష్మారెడ్డి,పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి పై పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2021 డిసెంబర్‌లో బ్రహ్మారెడ్డిని మాచర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమిస్తూ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో ఎవరేమిటో తేలనుంది.

సిపిఎం నేత సింహాద్రి శివారెడ్డికి ఘన నివాళి


గుంటూరులో

ప్రజాశక్తి-గుంటూరు

సింహాద్రి శివారెడ్డి స్ఫూర్తితో కేంద్రంలో అధికారంలో వున్న మతోన్మాద బిజెపిని, ఆ పార్టీకి అంటకాగుతున్న పార్టీలను రాబొయే ఎన్నికల్లో ఓడించాలని సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శనివారం బ్రాడీపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో శివారెడ్డి 7వ వర్ధంతి సభను ఆ పార్టీ నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. శివారెడ్డి చిత్రపటానికి సిపియం సీనియర్ నాయకులు ఎన్.వేణుగోపాలరావు, ఎమ్.డి అక్బర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సింహాద్రి శివారెడ్డి గుంటూరు జిల్లాలో అతివాద, మితవాద విచ్ఛిన్నకర ఉద్యమాలకు వ్యతిరేకంగా పోరాడి సిపియం నిర్మాణానికి కృషిచేశారని, అలాగే మంగళగిరి నియోజకవర్గంలో గ్రామ, గ్రామాన పార్టీ అభివృద్ధి చేశారన్నారు. గ్రామాలలో కుల, మత, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేశారని, గ్రామ ఎన్నికల్లో అన్ని కులాల వారికి అవకాశం ఉండే విధంగా చూసే వారన్నారు. ప్రస్తుతం కేంద్రంలో బి.జె.పి అధికారం లోకి వచ్చాక నిత్యజీవితావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు ఆకాశాన్నంటు తున్నాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా వున్న కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్నారు. భారత రాజ్యాంగం మౌలిక స్వభావానికి విరుద్ధంగా లౌకిక విలువలను తుంగలో తొక్కి, మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యలు చేపడుతుం దన్నారు. ఈవిధానాలకు వ్యతిరేకంగా శివారెడ్డి స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారా యణ, ఈమని అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు, ఎల్.అరుణ, బి.శ్రీనివాసరావు, నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, ఎమ్.కిరణ్, ఆదినికల్సన్, బి.ముత్యాలరావు, జి.వెంకట్రావు, వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.


తాడేపల్లిలో


ఉండవల్లిలో

ప్రజాశక్తి-తాడేపల్లి :తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నిష్కలంక రాజకీయ జీవితం గడిపిన సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు సింహాద్రి శివారెడ్డి నేటి తరానికి ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో శివారెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గాదె సుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, సోలా ముత్యాలరావు, వై.బర్నబస్ పాల్గొన్నారు. ఉండవల్లిలో సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శివారెడ్డి ఏడో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.భాస్కరయ్య, రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం ఆయన నడిపిన పోరాటం అజరామమని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఈమని రామారావు, ఎస్‌కె పీరూసాహెబ్, కె.జగదీశ్వరరెడ్డి, వి.పార్ధసారధి, టి.బక్కిరెడ్డి, పి.రాఘవులు, సైకం వెంకటనారాయణ, పి.గాంధీ, ఎ.వెంకటరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్

శానిటేషన్‌పై సమీక్ష సమావేశం

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం శానిటేషన్ పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిషనర్ వి నిర్మల్ కుమార్, అడిషనల్ కమిషనర్ ఎన్. ప్రకాశ రావు , డిప్యూటీ కమిషనర్ బి. శివారెడ్డి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని శానిటేషన్ అంశముపై పంచాయతీ సెక్రటరీలు, వార్డు శానిటేషన్ సెక్రటరీలు, శానిటేషన్ సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డోర్ టు డోర్ కలెక్షన్, సోర్స్ సెగ్రిగేషన్, డీ సిల్టింగ్, ఫాగింగ్, యాంటీ లార్వాల్ యాక్టివిటీస్, నైట్ శానిటేషన్ తదితర అంశములపై చర్చించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. శానిటేషన్ మెరుగుపరచడానికి కృషి చేయాలని కోరారు.

26న పసుపు రైతుల ఆందోళన

ప్రజాశక్తి తెనాలి

కోల్డ్ స్టోరేజ్ లో సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతు లను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 26న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందో ళన చేపట్టినట్లు పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు చెప్పారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎస్డబ్ల్యుసి కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ లో అగ్ని ప్రమాదం సంభవించి 35 రోజులు దాటిందన్నారు. ప్రమాదంలో పసుపు రైతులు దాదాపు రూ.100 కోట్ల విలువైన పంటను నష్టపోయారన్నారు. బాధిత రైతాంగానికి న్యాయం చేయాల్సిన అధికారులు ప్రమాదంపై కమిటీ నివేదిక రావాలంటూ తాత్సారం చేస్తున్నారన్నారు. రేపల్లె మాజీ శాసనసభ్యులు ముమ్మనేని వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించి నప్పుడు మంటలార్పేందుకు ఫైర్ సేఫ్టీ లేకపోవడం యాజమాన్యం బాధ్యతా రాహిత్యమన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి భీమాతో పాటు విపత్తుల నిర్వహణ నిధులనుంచి క్వింటాల్కు రూ. 12వేల చొప్పున రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య మాట్లాడుతూ రైతుల నుంచి అద్దె, బీమా ప్రీమియం వసూలు చేసిన యాజమాన్యం ఇప్పటివరకు పంట నష్టం, నష్టపోయిన రైతాంగం వివరాలను వెల్లడించకపోవటం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. 26న జరిగే ఆందోళనకు పసుపు రైతులు తరలిరావాలన్నారు సమావేశంలో పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ములక శివ సాంబిరెడ్డి, తెలుగు రైతు నాయకులు ఈదర పూర్ణచంద్, ఎం సాంబశివరావు, ఎన్ చంద్రశేఖర్, జి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివ శంకరరావు

వివా స్కూల్లో కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక వివా జూనియర్ క్యాంపస్‌లో శనివారం కల్చరల్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. వివిధ దేశాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై నమూనాలు ఆకర్షణీయంగా తయారు చేసి తరగతి గదుల్లో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇటలీ, యుఎఇ, ఇండియా, ఈజిప్ట్, అమెరికా దేశాలకు చెందిన ఆచార సాంప్రదాయాలు, ముఖ్యమైన చూడదగిన ప్రదేశాల్లో, ప్రముఖ కట్టడాలు, చారిత్రక ప్రదేశాలు, ఆహార అలవాట్లు, శాస్త్రవేత్తలు, ఆయాదేశాల ప్రజల వస్త్రధారణ తదితర అంశాలకు సంబంధించి నమూనాలు తయారు చేసి, ప్రదర్శనల్లో ఉంచారు. ఆయా దేశాలల్లోని పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు చూపించటానికి, వివిధ దేశాల మధ్య సాంస్కృతిక వారసత్వంలోని వ్యత్యాసాన్ని తెలుసుకునేందుకు ఇటువంటి ఫెస్ట్‌లు దోహదం చేస్తాయని స్కూల్ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు పలు పాటలకు నృత్యాలు చేశారు. ఈ ప్రదర్శనను తల్లిదండ్రులు, నంబూరులోని వివా స్కూల్ విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో సెక్రెటరీ బదరీప్రసాద్, క్యాంపస్ ఇన్‌ఛార్జి వేదవాణి తదితరులు పాల్గొన్నారు.


వెనిస్ బ్రిడ్జ్ నమూనా వద్ద చిన్నారులు

విఐటిలో ఘనంగా క్రీడా, సాంస్కృతిక ఉత్సవం

ప్రజాశక్తి - తుళ్లూరు : విట్ కళాశాలలో విటోపియా 2024 వార్షిక క్రీడల, సాంస్కృతిక ఉత్సవాలు శని వారం మొదటిరోజు ఘనంగా ప్రారంభమ య్యాయి. సంగీత, నృత్య విభాగాలలో మొదటి దశ పోటీలు వివిధ రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించే సాంప్రదాయ ర్యాలీతో ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్వి కోటా రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు కల్చరల్ కార్యక్రమాలు ఎంతో అవసరమని, అవి విద్యార్థుల మనసికా భివృద్ధికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. సాయంత్రం జరిగిన ప్రొ-షోలో మిథున్, దీపక్, నేహా గానం అందరినీ ఆకట్టుకొగా, జమ్మర్స్ బ్యాండ్, తాయికుడ్యం బ్రిడ్జ్ కేరళ బ్యాండ్, డిజె న్యూక్లియ బ్యాండ్‌ల సంగీత విభావరి అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ డాక్టర్ సుధాకర్ ఇలంగో, విటోపియా స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖాదీర్ పాషా పాల్గొన్నారు.







రైతు మృతికి కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి- ఫిరంగిపురం

ఢిల్లీలో రైతుల ఆందోళన పై పోలీసులు జరిపిన రబ్బర్ బుల్లెట్ కాల్పుల్లో మరణించిన యువ రైతు కరణ్ సింగ్ మృతికి కారుకులను శిక్షించాలని కోరుతూ, ఫిరంగిపురం మండలంలోని పొనుగుపాడు గ్రామంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు ఫిరంగిపురం మండల కార్యదర్శి మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కోసం చట్టం తీసుకురావాలని, స్వామినాథన్ సిఫార్సుల అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ రైతుల పోరాటంపై బీజేపీ ప్రభుత్వం అత్యంత కర్కసంగా వ్యవహరిస్తుం దన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, కౌలు రైతు సంఘం నాయకులు, కే కోటేశ్వరరావు, భాస్కర్ రావు, కే శ్రీనివాస రావు, జి వెంకటేశ్వరరావు, బ్రహ్మానందం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణానదిలో తెప్పోత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి :మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం కృష్ణానదిలో మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహాస్వామి తెప్పోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఉండవల్లి కృష్ణానది కరకట్ట నుండి విజయవాడ దుర్గా ఘాట్ వరకు అక్కడ నుండి కరకట్ట వైపుకు తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ కమిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరకట్టపై ఫ్లెక్సీల గొడవ

ప్రజాశక్తి-తాడేపల్లి : అమరావతి కరకట్టపై అధికార, ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్లీల గొడవ సాగుతుంది. దీంతో శనివారం ఈ ప్రాంతంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ అమరావతి కరకట్టపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. శనివారం జనసేన, టిడిపిలకు సంబంధించి కొన్ని నియోజకవర్గాలకు ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన వెలువడటంతో ఆ పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మోత మోగిద్దాం పేరుతో చంద్రబాబు ఇంటి వద్ద నుంచి సీతానగరం వరకు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను రెండు గంటల వ్యవధిలోనే గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. విషయం తెలిసి ఆ ప్రాంతానికి చేరుకున్న టిడిపి కార్యకర్తలు వచ్చేది తమ ప్రభుత్వమేనని పెద్దఎత్తున నినాదాలు చేశారు. మున్సిపల్ అధికారులు తొలగించారా, వైసిపి కార్యకర్తలే తొలగించారా అని ఆరా తీస్తున్నారు.



వైష్ణవి కళాశాలలో సీనియర్స్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం జరిగిన ఫేర్వెల్ కార్యక్రమంలో తెనాలి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రసంగించారు. ఉన్నతవిద్యను అభ్యసించే క్రమంలో గురువులు సలహాలు తప్పకుండా పాటించాలన్నారు. విద్య పూర్తిచేసుకున్న అనంతరం ఏదోఒక ఉద్యోగంలో స్థిరపడాలని అన్నారు. శరవేగంగా విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. తొలుత డిటిఎస్ ఆనంద్ అందించిన సంగీత విభావరి విద్యార్థు లను అలరించింది. కార్యక్రమంలో తాడిబోయిన రమేష్, బాబు బేగం, విజయ్ కృష్ణ, నవీన్, వీరేంద్ర, రోజ్ మేరీ నరసింహారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కోసం దరఖాస్తు

ప్రజాశక్తి-క్రోసూరు



పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశమివ్వాలని కోరుతూ నియోజకవర్గంలోని కోసూరు మండలం దొడ్లేరుకి చెందిన దళిత ఉద్యమ నేత,న్యాయవాది కోరబండి బాబురావు కోరారు. ఈ మేరకు శనివారం విజయవాడలోని కాంగ్రెస్ ఆంధ్ర రత్న భవనంలో కార్యాల ఇంచార్జ్ సుశీలకి తన బయోడేటాను అందజేశారు. కాగా, 2021 లో దొడ్లేరు గ్రామ సర్పంచిగా ఆయన పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు.



'టిడిపి నాయకుల వ్యాఖ్యలు అర్థరహితం'

ప్రజాశక్తి-అచ్చంపేట

వైఎస్ఆర్సిపి పార్టీకి వస్తున్న ఆదరణ తట్టుకోలేక టిడిపి నాయకులు అర్థరహిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ పల్నాడు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు సాతర్ల శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు శనివారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తపల్లి మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు ప్రాధాన్యతనిస్తూ నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థిగా పి.అనిల్ కుమార్ యాదవ్ ను నియమంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిసి హక్కుల పోరాట యోధుడు ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సీటు ఇచ్చి గౌరవించారన్నారు. రానున్న రోజుల్లో ఎంపీ,ఎమ్మెల్యేలు అత్యధిక మెజారిటీతో గెలవనున్నట్లు వాళ్ల ధీమా వ్యక్తం చేశారు సమావేశంలో జడ్పిటిసి తున్న విజయ ప్రతాప రెడ్డి, బి.కృష్ణ నాయక్, వైస్ ఎంపిపి తెల్లమేకల నాగరాజు, చిలకా చంద్రయ్య పాల్గొన్నారు

వసతి గృహ నిర్వాహకులకు బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఎ స్సీ,బీసీ,ఎస్టీ వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.16 కోట్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్ఆర్టి సెంటర్లోని సంఘం కార్యాలయంలో విలకరులతో మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు రూ.2,200, పాఠశాల విద్యార్థులకు రూ.1400 చొప్పున ప్రభుత్వం ప్రతినెలా చెల్లించాల్సి ఉందన్నారు.వారికి బిల్లులు ఇవ్వకపోతే విద్యార్థులకు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం, సాయంత్రం భోజనం పెట్టలేరని, అదేవిధంగా రోజుకో రకం అల్పాహారం ఇవ్వాల్సి ఉందని, వారికి బిల్లులు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. వసతి గృహ నిర్వాహకులు అప్పులు చేయాల్సిన దుస్థితి వైసిపి ప్రభుత్వంలో నెలకొందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే వసతి గృహ నిర్వాహకుల బిల్లును చెల్లించాలని డిమాండ్ చేశారు.

నోటిఫికేషన్ రాగానే ఫ్లెక్సీలు తొలగించాలి

ప్రజాశక్తి- రెంటచింతల

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రాగానే వివిధ కూడళ్ళ లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాల్సి ఉంటుందని ఎంపీడీవో,ఎన్నికల నియమ నిబంధనల అధికారి శంకరరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 'కోడ్' అనేది రాజకీయ నాయకులకే కాదని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు వర్తిస్తుందన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలను వస్త్రాలతో మూసి ఉంచాలని, కరపత్రాలపై ప్రింటింగ్ ప్రెస్ చిరునామా ఉండాలని, తాగునీటి ట్యాంకర్లపై ఫోటోలు ఉంటే వాటిని కప్పి ఉంచాలని, ఎన్నికల కౌంటింగ్ అయ్యే వరకు ఈ నియమావళి అమలులో ఉంటుందన్నారు

30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురిసౌత్ లో నాబార్డ్ నిధులతో నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ 5 కోట్ల 32 లక్షల రూపాయలతో ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.పేదల కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో మాచర్ల నియోజకవర్గంలో ఎప్పుడూ లేని అభివృద్ధి జరిగిందన్నారు.ముందుగా డౌన్ మార్కెట్లో నూతన సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మెడికల్ ఆఫీసర్ రంగారావు, విజయపురి సౌత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపర్నెంట్ డాక్టర్ కెపి చారి, మాచర్ల గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్నెంట్ ఉదయభాను, డాక్టర్ విజయలక్ష్మి, సివిల్ సర్జన్, ,జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి,జెడ్పీటీసీ, వైసీపీ నాయకులు బూడిద శ్రీనివాసరావు, మల్లుస్వామి,వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి,తాళ్లపల్లి సర్పంచ్ జె. వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



విజయపురిసౌత్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

'ప్యాకేజి రాజకీయాలకు బలికావద్దు'

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ఆశలపై నీళ్ల చల్లుతూ టీడీపీ పల్లకి మోసేందుకు పవన్, చంద్రబాబుతో ఒప్పందం చేసుకున్న ప్యాకేజి రాజకీయాలకు జనసైనికులు బలికావద్దంటూ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన పొత్తులపై తనదైన శైలిలో ఘాటు విమర్శలు చేశారు. మంత్రి మాట్లాడుతూ టీడీపీతో పొత్తులో భాగంగా జనసేన 60, 70 సీట్లు సాధించి, ఇక తమ అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అవడం ఖాయమంటూ నినాదాలు చేసిన పార్టీ కార్యకర్తలు శనివారం వెలువరించిన సీట్లతో తీవ్ర అయోమయానికి గురయ్యారని విమర్శించారు. ఈ ప్రకటనతో కాపులను వెన్నుపోటు పొడిచారని, ఇది గమనించి ప్యాకేజి రాజకీయాలకు బలికావద్దని అన్నారు. చివరికి తనసీటు కూడా ప్రకటించుకోలేని దయనీయ స్థితిలో పవన్ కళ్యాణ్ ఉన్నారని అన్నారు. జనసేన 24 నియోజవర్గాలలో కేవలం 3 ఎంపీ సీట్లతో సర్దుబాటు చేసుకోవడంతో ఆ పార్టీ కార్యకర్తలలో తీవ్ర నైరాశ్యం నెలకొందన్నారు. వంగవీటి రంగా హత్యానంతరం కాపు,కమ్మ సామాజిక వర్గాల మధ్య నెలకొన్న అగాధాన్ని పూడ్చేందుకు పవన్ కంకణం కట్టుకున్నారని, కాపులను చంద్రబాబు దొడ్లో కట్టేసేందుకు పవన్ పార్టి పెట్టారని దుయ్యబాట్టారు. ముద్రగడను బ్రతికుండగానే వేధించిన చంద్రబాబు పక్కన చేరి కాపులకు మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాలు సాధిం చి, తిరిగి అధికారాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.



వైసిపి కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి

కులమతాలను రెచ్చగొడితే తరిమి కొడతారు: టిడిపి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కులాలను మతాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తే పల్నాటి యాదవులు వైసిపి నాయకులను తరిమికొడతారని తెలుగు రైతు పట్టణ అధ్యక్షులు పీల సాంబశివరావు యాదవ్ హెచ్చరించారు. సత్తెనపల్లి టిడిపి ప్రజా వేదికలో శనివారం టిడిపి నాయకులు మాట్లాడుతూ అనిల్ కుమార్ యాదవ్ ఇటీవల పెదకూరపాడు నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. యాదవులను కించపరిచేలా టిడిపి అధినేత చంద్రబాబు ఎప్పుడూ మాట్లాడలేదని, దమ్ముంటే ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు.

'నెలనెలా సాహిత్య మేళా'

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

'నెల నెలా సాహిత్య మేళా'లో భాగంగా ప్రతి నెలా చివరి శనివారం కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తెలుగు సాహిత్యంలో రామాయణం కవులు - వారి నవ్యత అంశంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేటలోని కలెక్టర్ బంగ్లా సమీపంలోని కళాక్షేత్రంలో. కలెక్టర్ ఎల్. శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీజ్యోతి ప్రజ్వలన చేశారు. తెలుగుతల్లి విగ్రహానికి, విశ్వనాథ సత్య నారాయణ విగ్రహానికి పూలమాలలు వేశారు. కుందా భాస్కరరావు రచించిన పుస్తకం పల్నాడు జిల్లాలో వ్యక్తీ కరించడం మహాద్భుతమన్నారు. సాహితీ ప్రియులు చెవిరెడ్డి మస్తాన్రెడ్డి, సాహిత్య పోష కులు రంగనాథ రామాయణం, బాల రాముడు విగ్రహ ప్రతిష్ట ను ప్రధాన మోడీ ఆవిష్కరిం చారని వివరించారు. వి.సుబ్బారావు తెలిపిన (రచించిన 2వ రామాయణం) ఆంధ్ర రామా యణం గురించి వివరించారు. కార్యక్రమంలో వేదాంతం శ్రీనివాస్ అయ్యంగర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ ప్రసాద్, డీఈవో వెంకటేశ్వరరావు, మైనింగ్ శాఖ ఏడి నాగిని, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

'ఇసుక దందా అధికారులకు కనిపించడం లేదు!'

ప్రజాశక్తి-బెల్లంకొండ

రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై ప్రతిపక్ష పార్టీలైన తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి ఎన్ని పోరాటాలు చేసిన నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించిన అధికారులు నేడు కేంద్ర పర్యావరణ శాఖ సమర్పించిన నివేదికపై ఏమి సమాధానం చెబుతారని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగు తున్న మాట వాస్తవమేనని కేంద్ర పర్యావరణ అటవీశాఖ హైకోర్టుకు తెలిపిన మాట వాస్తవం కాదా ప్రశ్నించారు. ఎన్జీటీ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను పరిశీలించి, అక్కడ ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న భారీ యంత్రాల ఫోటోలను నివేదిక ద్వారా సమర్పించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దీనికి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఏమి సమాధానం చెబుతారని అన్నారు. ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా వచ్చిన డబ్బుతో అధికార వైసిపి రానున్న ఎన్ని కలలో గెలవాలని ప్రయత్నిస్తోందని, అందుకు సహకరించిన అధికారులు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చ రించారు. అక్రమ తవ్వకాలను ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీ సభ్యులపై, మీడియా సభ్యులపై దాడి చేస్తుంటే కలెక్టర్లకు కనిపించడం లేదా అన్నారు.



శానిటేషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-మాచర్ల

పారిశుధ్య పనుల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని మున్సిపల్ కమిషనర్ దేవళ్ళ వెంకటదాసు సూచిం చారు. శనివారం ఉదయం ఆయన పట్ట ణంలోని పలు ప్రాంతాలలో శానిటేషన్ పనులను పరిశీలన చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటదాసు మాట్లాడుతూ పారిశుధ్య పనులు సక్రమంగా సాగితే ప్రజా ఆరోగ్యం మెరుగుపడు తుందన్నారు. ఇందు కోసం నియమించిన సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాల న్నారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ప్రజలు కూడ తమ ఇళ్ళ పరిసర ప్రాంతాలలో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకుంటే దోమల బెడద తగ్గుతుందన్నారు.

ఇంటి పట్టాలు పొందిన వారికి ఉచిత రిజిస్ట్రేషన్లు

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలకు సచివాలయాల ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్స్ చేస్తున్నట్లు మున్సి పల్ కమిషనర్ దేవళ్ళ వెంకటదాసు తెలిపారు. 13వ బ్లాక్లోని రైల్వే క్వార్టర్స్ సచివాలయం పరిధిలో శనివారం వైస్ చైర్మన్ పోలూరి నరసింహరావుతో కలిసి ఉచిత రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట దాసు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఉచితం అని వివరించారు. పట్టణంలోని ఆయా సచివాలయాల పరిధిలో ఇంటి స్థలాలు కేటయింపు జరిగి, పట్టాలు అందుకున్న పేదలు వారు నివాసం ఉండే సచివాలయాలకు వెళ్ళి ఉచితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని లబ్దిదారులను సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్య క్రమంలో ఆడ్మిన్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బిఎల్ఓలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

రానున్న ఎన్నికలలో బూత్ లెవల్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ డి.వెంకటదాసు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బిఎల్ఓలతో ఎన్నికలకు సంబంధించి ముందుస్తు పనులపై కమిషనర్ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 46 పోలింగ్ బూత్లకు బిఎల్ఓలు ఉన్నట్లు తెలిపారు. వారి పరిధిలో పోలింగ్ స్టేషన్స్ పరిశీలించినట్లు చెప్పారు. పలు బూత్లలో ర్యాంప్స్, లైటింగ్, వాటర్ ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు స్పందిం చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించానని, పూర్తిగా మైగ్రేట్ అయిన ఓటర్ల వివరాలు సేకరించి, పంచనామా చేసి తొలగించనున్నట్లు తెలిపారు. ఫారమ్ 6, 7, 8, 8ఎలను సక్రమంగా పరిశీలించాలని ఆదేశించి నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత చేపట్టాల్సిన విధుల గురించి, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ గురించి వివరించారు. సమావేశంలో మేనేజర్ అఫ్జల్ ఖాన్, మున్సిపల్ సిబ్బంది, బిఎల్ఓలు పాల్గొన్నారు.

కోటప్ప కొండపై మాఘశుద్ధ పౌర్ణమి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా శనివారం కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి సందర్శకులు పోటెత్తారు. కార్యక్రమాలను ఆలయ కార్య నిర్వాహణ అధికారి జి.శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెట్ నాగిరెడ్డి లు పర్యవేక్షించారు.

క్లోరిన్ శాంపిల్స్ తప్పనిసరిగా సేకరించాలి : ఎఇ

ప్రజాశక్తి-గుంటూరు

తాగునీటి సరఫరా సమయాల్లో ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా వార్డులలో అందుబాటులో ఉండి, క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని నగరపాలక సంస్థ ఎస్.ఈ. (ఎఫ్ఏసి) సుందర్రామిరెడ్డి తెలిపారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు నగరంలోని వార్డు సచివాలయ ఎమినిటి కార్యదర్శుల సమీక్షా సమావేశం శనివారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఈ. మాట్లాడుతూ నగరంలో ఉదయం, సాయంత్రం జరిగే తాగునీటి సరఫరాలో ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని, శ్యాంపిల్స్ రిపోర్ట్‌లను స్థానికుల సంతకాలతో ప్రత్యేక రిజిస్టర్ నమోదు చేయాలన్నారు. క్లోరిన్ శ్యాంపిల్స్‌లో ఎక్కడైనా తాగునీటి కాలుష్యం గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేయాలన్నారు. ఇప్పటికే ఎమినిటీ కార్యదర్శులకు ఎం.బుక్ వంటి కీలక బాధ్యతలను నగర కమిషనర్ కేటాయించారని, కార్యదర్శులు సమర్ధవంతంగా విధులు నిర్వహించాలన్నారు. అలాగే తాగునీటి సరఫరా సమయంలో పైప్‌లైన్ లీకులు, సంపుల లీకులను గుర్తించి వాటి మరమ్మతులు ఏఈ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. డ్రైన్లలో గానీ, సమాంతరంగా ఉన్న పైప్‌లైన్ల మార్పు కోరుతూ ఏఈలకు లిఖితపూర్వక రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఎక్కడైనా తాగునీటి సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు అందితే సంబంధిత ఎమినిటీ కార్యదర్శే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల పాత, కొత్త రెండు పైప్ లైన్లు ఉన్నాయని, పాతలైన్‌ని డమ్మీ చేయాలన్నారు. డ్రైన్‌ల కింద ఎక్కడైనా పైప్ లైన్ ఉంటే వెంటనే వాటిని షిఫ్ట్ చేయడానికి ఏఈలు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయం పరిధిలో ఎవరైనా జిఈ (గ్యాస్ట్రో ఎంటరాలజీ) సమస్య వలన అనారోగ్యానికి గురైనట్లు నమోదు అయిన వారి నివాసంకు ఉన్న ట్యాప్ కనెక్షన్, పైప్‌లైన్, వారు తాగడానికి ఏ నీరు వినియోగిస్తున్నారు వంటి వివరాలతో ఎప్పటికప్పుడు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షణ చేయాలని, నాణ్యతా ప్రమణాలు పాటించేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఈ.ఈ. కోటేశ్వరరావు, డిఈఈ రాము, ఏఈలు సునీల్ కుమార్, శ్రీకాంత్, సూరిబాబు, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్.ఈ. సుందరరామిరెడ్డి

ఫైబర్ వ్యర్థాలు నియంత్రించాలి

వర్సిటీలో రసాయన శాస్త్రంలో ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ సస్టైనబుల్ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్' రెండు రోజుల సదస్సు శనివారం ముగిసింది. సదస్సు డైరెక్టర్ ఆచార్య డి. రామచంద్రన్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా పాల్గొన్న వర్సిటీ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి మాట్లాడుతూ సదస్సుల నిర్వహణతో పరిశోధకుల్లో పరిశోధన అభిలాష పెరుగుతుందని, తద్వారా నూతన అంశాలపై ఆవిష్కరణలు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి. హరిబాబు మాట్లాడుతూ రసాయన శాస్త్ర పరిశోధనలు సమాజ పురోభివృద్ధికి దోహద పడుతున్నాయని వివరించారు. శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పివి. రమణ సుస్థిరమైన వికసిత భారత్ టెక్నాలజీ కోసం స్వదేశీ సాంకేతికతలు అనే అంశాన్ని వివరించారు. పెరుగుతున్న జనాభా వల్ల కాలుష్యం పెరుగుతుందని, శక్తి, ఆహారం, ఫైబర్ వినియోగం వల్ల ఉత్పన్నమయ్యే వ్యర్థాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. వీటిల్లో 40 నుంచి 50 శాతం సేంద్రియ వ్యర్థాలు ఉన్నాయని పేర్కొన్నారు. బొప్పాయి తొక్క, చింతపండు గింజలు, ఇన్సూలిన్ ఆకు వంటి సేంద్రియ వ్యర్థాలను ఉపయోగించి ఆక్సా డియోజోన్స్‌ను విజయ వంతంగా సంశ్లేషణ చేశారని తెలిపారు. సిఎస్ఐఆర్ ఐఐసిటి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె. సురేష్ బాబు మాట్లాడుతూ రంపచోడవరం నల్లమల అటవీ ప్రాంతంలో లభించే ఔషధ మొక్కలను వివిధ రకాల వ్యాధులను నయం చేసే మందుల తయారీలో వినియోగి స్తున్నారని సూచించారు. మరొక వక్తగా పాల్గొన్న డాక్టర్ ఎన్.అన్నపూర్ణ మాట్లాడుతూ మాలిక్యులర్ బయాలజీ విప్లవం ఫార్మసూటికల్స్ యుగంలో స్థిరమైన సాంకేతికత అమలు, ప్రాచీన భారతీయ రసాయన శాస్త్రం గురించి వివరించారు. స్క్రిప్స్ ఫార్మా ప్రతినిధి డాక్టర్ బి. రవి కెమిస్ట్రీ , పైర జోలిన్ సంశ్లేషణను వివరించారు. ఈ సదస్సులో ఆచార్య సుబ్బారావు ,ఆచార్య రమేష్ రాజు, డాక్టర్ బాల మురళి, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.



నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ బి శేషన్న

అవాస్తవ ప్రచారాలను నమ్మొద్దు

గురవయ్య కాలనీలో నీటి శాంపిల్స్ పరిశీలనకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలో నీటి కాలుష్యం లేదని, ప్రజలు అధైర్య పడాల్సిన అవసరం లేదని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న చెప్పారు. స్థానిక 11వ వార్డు గురవయ్య కాలనీలో డయేరియా లక్షణాలతో మహిళ మృతి చెందిన ఘటన, అలాగే మరికొందరు వాంతులు విరోచనాలతో చికిత్స పొందుతున్నారన్న వార్తలపై స్పందించిన కమిషనర్, చైర్ పర్సన్ తాడిపోయిన రాధిక ఆ ప్రాంతంలో పర్యటించారు స్థానికులతో మాట్లాడారు. నీటిని స్వయంగా పరిశీలించారు. మున్సిపల్ డి ఇ లను నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపిం చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి నుంచి ఎలాంటి వాసన లేదని, రంగు మారటం కూడా అసత్య ప్రచారమని చెప్పారు. అయినప్పటికీ ప్రతిరోజు నీటి శాంపిల్స్ సేకరించి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామన్నారు. ప్రజారోగ్యం, శానిటేషన్ పై ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఆయన వెంట ఎం హెచ్ ఓ డాక్టర్ కెహెచ్ నిర్మల, డి ఈ కె నాగభూషణం, ఏఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్లు ఎ రామచంద్రరావు, డి శ్రీనివాసరావు ఉన్నారు.

అయ్యప్ప దేవాలయంలో అన్నదానం

ప్రజాశక్తి ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం, పాత మల్లాయపాలెం గ్రామంలోని అయ్యప్ప స్వామి దేవాలయం 8వ వార్షికోత్సవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ, నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త బలసాని కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలసి ముచ్చటించారు. మంత్రి రజని మాట్లాడుతు నియోజకవర్గంలో ఎమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని మంత్రి రజని తెలిపారు.

పర్యాటకంతో దేశాభివృద్ధి

ప్రజాశక్తి ఏఎన్‌యు

భారతదేశ అభివృద్ధిలో వారసత్వ, సాంస్కృతిక పర్యాటకం ముఖ్య భూమిక పోషిస్తుందని విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ స్వరూప రాణి పేర్కొన్నారు. వర్సిటీలోని టూరిజం అండ్ హాస్పిటాలిటి మేనేజ్మెంట్ విభాగం రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ హెరిటేజ్ టూరిజం డెవలప్మెంట్ రెండు రోజుల జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య స్వరూప రాణి మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నో పురాతన వారసత్వ సంపదలు ఉన్నాయని, వాటిని వెలికితీయడంతో పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ పి. పూర్ణచంద్ర రావు మాట్లాడుతూ పర్యాటక రంగం దినదినాభివృద్ధి చెందుతుందని అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ముందు వరుసలో ఉన్న మన భారతదేశం కూడా పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుందన్నారు.



ఇందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు పర్యాటక మంత్రిత్వ శాఖలు, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. పర్యటకంతో దేశాభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని వివరించారు. సదస్సులో తమిళనాడుకు చెందిన ప్రొఫెసర్ రఘు, హైదరాబాదు ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ కళాశాల అధ్యాపకులు సుమన్, టెక్నికల్ సెషన్స్ కు నిర్ణేతలుగా వ్యవహరించారు. సదస్సు అనంతరం పరిశోధన పత్రాలు సమర్పించిన పరిశోధకులకు ధ్రువ పత్రాలను అందజేశారు. సదస్సులో విభాగం ఆధ్యాపకులు ఎస్.కె రెహమాన్, డాక్టర్ గీత సోనీ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ రాజేష్, డాక్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్లో లెడ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి టిప్పర్ల బజార్‌లోని నారాయణ పాఠశాలలో శనివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌ను ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా టీచర్లు ప్రదర్శించిన అకాడమిక్ ప్రాజెక్ట్స్‌ను విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏజీఎం కె. మురళీ కిషోర్, ఆర్ఐ ఆర్. రామారావు, కిడ్స్ కోఆర్డినేటర్ వి. కనకదుర్గ ప్రిన్సిపల్ ఎన్. ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి తెనాలి :పెదకాకాని దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య శనివారం సమీక్ష జరిపారు. ఆలయ ఉప కమిషనర్ డి శ్రీరామ వరప్రసాదరావు సమీక్షలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యేకంగా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి బృందం ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేను స్వాగతించారు. సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు జి సుబ్బాయమ్మ, కె శివ రత్నాలు, టి రవీంద్ర, కె శివ నాగేశ్వ రమ్మ, జి మల్లేశ్వరరావు, జి వెంకట్రావు, సిహెచ్ అరుణ, పి వెంకటేశ్వరరావు, ఎం జ్యోతి, కె పార్వతి పాల్గొ న్నారు.

ఆర్గానిక్ పసుపు పంటను పరిశీలించిన రాష్ట్ర బృందం

ప్రజాశక్తి తెనాలి :నియోజకవర్గ పరిధిలోని కొల్లిపరలో శనివారం రాష్ట్ర ఆర్గానిక్ ప్రోడక్ట్స్ సర్టిఫికేషన్ బృందం పర్యటించింది. శ్రేష్ట ఫార్మ్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో 24 మంది రైతులు సాగుచేస్తున్న పసుపు పంటను ఆ బృందం పరిశీలించింది. డాక్టర్ ఎం ప్రతాప్ రెడ్డి నేతత్వంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి బి రవీంద్రబాబు పసుపు శాంపిల్స్ సేకరించారు. వాటిని పరీక్షలకు పంపిస్తామని తెలిపారు. గ్యాప్ ఆధ్వర్యంలో పంటలు పండించిన రైతులకు సర్టిఫికేషన్ ఉంటుందన్నారు. డాక్టర్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ శ్రేష్ట ఫార్మ్ ప్రొడ్యూసర్స్ కంపెనీలో రికార్డులను కూడా పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ పి.ఉష, విహెచ్ఎ రవితేజ, ఎంఈఓ శ్రీధర్ రెడ్డి, శ్రేష్ట ఎఫ్పీసి డైరెక్టర్లు ఎన్ కుటుంబ రెడ్డి, ఉయ్యూరు సాంబిరెడ్డి, దొంతి రెడ్డి శంకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

మార్చి 1 నుంచి 15 వరకు జరగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పట్టణంలోని సుజాత, పిబిఎన్, వెంకటేశ్వర కళాశాలలను, కళాశాలల పరిసరాలను శనివారం అర్బన్ సిఐ పి. భాస్కర్ పరిశీలించారు. ప్రిన్సిపాళ్లతో మాట్లాడి పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కళాశాలల పరిసర ప్రాంతాలలో మాస్ కాపీయింగ్ జరగకుండా నివారించేందుకు జిరాక్స్ షాపులు తీసి వేయాలని షాపు యజమానులకు ఆదేశించారు.

నేడు గ్రూప్ 2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని చేబ్రోలు ఇంజినీరింగ్ కాలేజీ మరియు సెయింట్ మేరీస్ మహిళా ఇంజినీరింగ్, విజ్ఞాన్ యూనివర్సిటీలలో ఏపీపీఎస్సీ గ్రూప్ 2 పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పోలీస్, రెవెన్యూ అధికారులు తెలిపారు. పరీక్షలు జరుగుతున్న కాలేజీల చుట్టుప్రక్కల, కొద్ది దూరంలో ఉన్న కంప్యూటర్ మరియు జిరాక్స్ షాపులు ఉదయం నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు మూసివేసి యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఇందుకు భిన్నంగా ఎవరైనా ప్రవర్తించిన ఎడల చట్ట ప్రకారం శిక్షార్హులని తెలిపారు.

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం ఏడు రోజుల ప్రత్యేక శిబిరములో భాగముగా రత్నాల చెఱువులో శనివారం కీర్తి ట్యుటోరియల్ ప్రాంగణములో సిపిఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సి.కే జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఎం విజయ మోహన్ రావు, సీనియర్ జర్నలిస్టు ఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నిర్మల ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాముల రెడ్డి, సమన్వయ కర్త శ్రీ నరసింహ నాయక్ , కళాశాల అధ్యాపకులు, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ రితేష్ చంద్ర, జి హేమలత, బీ దివ్య, లిల్లీ ప్రసన్న, కుమార్, రేవంత్, జాన్, పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యునిగా అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి మంగళగిరి

ఎస్సీ కమిషన్ సభ్యుడిగా పని చేసిన బసవరావు తన పదవికి రాజీనామా చేయడం వల్ల ఆ పదవికి తిరిగి అదే సామాజిక తరగతికి చెందిన వ్యక్తితో భర్తీ చేయాలని చేయాలని ఎపి ఎస్సి, ఎస్టి రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు బుల్లా రాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళగిరి తెనాలి రోడ్డులోని బాబు జగ్జీవన్ రావు విగ్రహం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో 34 వేల మంది మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఉన్నారన్నారు. వారిలో అధికులు వైసిపికి అండగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని మాదిగ సామాజిక వర్గానికి ఎస్సీ కమిషన్ నెంబర్ ఇవ్వాలని ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి గంజి చిరంజీవిలకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ఆర్కే కలిసి సిఫార్సు చేయమని కోరడం జరిగిందని తెలిపారు.

ఇచ్ఛాపురం టు పులివెందుల బైక్ యాత్ర

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై అభిమానంతో ఇచ్ఛాపురం నుండి పులివెందుల వరకు బైక్ యాత్ర చేస్తూ, తెనాలి నియోజకవర్గం చేరుకున్న సంజయ్ స్థానిక శాసన సభ్యులు అన్నాబత్తుని శివ కుమార్‌ను శనివారం బుర్రిపాలెం ఎఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రచారానికి సిద్ధం అంటూ వైఎస్ఆర్సిపి తరపున బైక్ యాత్ర ప్రారంభించి నట్లు సంజయ్ తెలిపారు. పార్టీపై తనకున్న చిత్తశుద్ధి తాను చేస్తున్న బైక్ యాత్రను చూస్తుంటే తెలుస్తుందని ఎమ్మెల్యే కొనియాడారు.



సంజయ్‌ని అభినందిస్తున్న ఎమ్మెల్యే

ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు

దరఖాస్తులు చేసుకోండి : జిల్లా విద్యాధికారి ఎం వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : మార్చి 14వ తేదీ లోపు 2024-25 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. అనాథలు, హెచ్ఐవి బాధితులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, ఓసి, మైనారిటీలకు ప్రాధాన్యత ఉంటు ందన్నారు. విద్యాహక్కు చట్టం కింద ప్రతి స్కూల్లో ఉన్న విద్యార్థుల మొత్తంలో నుంచి పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని డిఇఒ తెలిపారు. పవేశానికి http: //cse.ap.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 18004258599 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలన్నారు.



పోస్టర్లు, బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

1వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ ఆర్ఐఒ జి.కె.జుబేర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఈనెల 1వ తేదీ నుండి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఒ జి.కె.జుబేర్ తెలిపారు. శనివారం స్థానిక సాంబశివపేటలోని ఆర్ఐఒ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 92 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిలో 59,438 మంది విద్యార్థులు హాజరు అవుతున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. అర్ధగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కొన్ని యాజమాన్యాల నుండి హాల్ టిక్కెట్ల తీసుకోవటంలో విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందుల్ని తొలగించేందుకు ఈ ఏడాది వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా పరీక్షకు అనుమతి ఇస్తూ బోర్డు నిర్ణయం తీసుకుందని చెప్పారు.కావున హాల్‌టిక్కెట్ల విషయంలో విద్యార్థులకు ఆందోళన అవసరం లేదన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్, పరీక్షా కేంద్రాలలో సదుపాయాలు, ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, తదితర అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఏదైనా సమస్య ఎదురైతే ఆర్ఐఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ (7815968897) నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఒ

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల నుండి ఏ విధమైన కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ అన్నారు. రాజకీయ పార్టీలు రాబోయే ఎన్నికల్లో తమ మ్యానిఫెస్టోల్లో పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని పొందుపరిచాలని, అప్పుడే సిపిఎస్ ఉద్యోగుల్ని ఓటు అడగాలన్నారు. 'ఓట్ ఫర్ ఓపిఎస్' పేరుతో రూపొందించిన గోడప్రతులు, బుక్‌లెట్‌ను శనివారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్, ఓపిఎస్ విధానాల గురించి సంపూర్ణంగా అవగాహనకు ఈబుక్‌లెట్ దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం సిపిఎస్ విధానం ద్వారా పెన్షన్ పొందుతున్న పెన్షనర్ల దయనీయ పరిస్థితులు పుస్తకంలో లెక్కలతో సహా వివరించినట్లు చెప్పారు. ఓపిఎస్ అమలు చేస్తామనే పార్టీలకే రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలని ఉద్యోగుల్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ హనుమంతరావు, జిల్లా నాయకులు జి.వెంకటేశ్వర్లు, సిహెచ్.ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, ప్రేమ్‌కుమార్, కోటిరెడ్డి, షకీలాబేగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శివప్రసాద్, తదితరులు

'చలపతి'లో ముగిసిన మెలనోత్సవ్

ప్రజాశక్తి-గుంటూరు : లాం లోని చలపతి పార్మశీ కాలేజిలో రెండ్రోజులపాటు నిర్వహించిన సిఎల్‌పిటి మెలనోత్సవ్ 3.0 శనివారం ముగిసింది. పోటీల అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డీన్ ప్రొఫెసర్ ఆర్.శివప్రసాద్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు, ఒత్తిడి దూరమై బలమైన దేహదారుఢ్యం, మేధాసంపత్తిని పొందవచ్చన్నారు. క్రీడలలో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో ఉండాలన్నారు. ఓటమి తదుపరి విజయానికి నాంది అని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రామారావు మాట్లాడుతూ ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 16 కళాశాలల నుండి 482 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, షార్ట్‌పుట్, చెస్, క్యారమ్స్, రన్నింగ్, త్రోబాల్ పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

నీటి కాలుష్యంపై వీడని నిర్లక్ష్యం

వీక్షణం

గుంటూరుతో సహా జిల్లాలోని వివిధ పట్టణాల్లో తాగునీటి సరఫరాలో కాలుష్యం వెంటాడుతోంది. నీటిసరఫరాలో లోపాల వల్ల ప్రజలు డయేరియా బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. గుంటూరులో 2018 మార్చిలో నీటి సరఫరాలో డ్రైనేజి నీరు కలవడం వల్ల మూడు వేల మంది వరకు అస్వస్తతకు గురయ్యారు. 24 మంది చనిపోయారు. అప్పట్లో ఉన్న కమిషనర్ చల్లా అనూరాధ, అప్పటి ఇంజనీరింగ్ అధికారులు నీటి కాలుష్యంను అంగీకరించక మొదట్లో ఫుడ్ పాయిజనింగ్ అని చేతులు దులుపుకోవడం వల్ల 10 రోజుల వ్యవధిలో 24 మంది బలయ్యారు. అప్పట్లో పాతగుంటూరులో తాగునీటి పైపు లైన్లలోకి డ్రైనేజి నీరు కలిసి తాగునీరు కలుషితమై గుంటూరు ప్రజలను వణికించింది. నీటి కాలుష్యం వల్ల తీవ్రమైన కడుపునొప్పితో వాంతులు, విరోచనాలు వల్ల సంభవించే నిస్సత్తువ ప్రభావం శరీరంలోని వివిధ అవయావాలపై పడుతోంది. ఏ అవయవం విఫలమైనా మరణం సంభవించే అవకాశం ఉంటుంది. వాంతులు, విరోచనాల వల్ల తీవ్ర అస్వస్తతకు గురయిన తరువాత మరణిస్తే శరీరంలో ఎదో ఒక సమస్యతో వారు మరణించారని అధికారులు నివేదికలు రూపొందించి చేతులు దులుపుకొంటున్నారు. తాజాగా ఈనెల 9వతేదీ నుంచి దాదాపు 10 రోజుల పాటు గుంటూరులో డయేరియా మరో సారి వణికించింది. వాంతులు, విరోచనాలతో ఐదుగురు చనిపోయారు. శారదాకాలనీలో పైపు లైన్లలో నీటి కాలుష్యం వల్లే ఎక్కువ మంది డయేరియా బారిన పడ్డారని నిర్ధారణకువచ్చాకే గుంటూరు కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగంకు చెందిన ఆరుగురిని కమిషనర్ చేకూరి కీర్తి సస్పెండ్ చేశారు. డయేరియా ప్రబలిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన వారే బాధితులుగా గుర్తించడం పరిపాటిగా మారింది. చాలా మంది అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడం, ఆర్ఎంపిల వద్ద చికిత్సపొందడం, మెడికల్ షాపుల్లో మందులు తెచ్చుకుని ఇళ్ల వద్ద సొంతంగా చికిత్సలు పొందే వారు కూడాపెద్ద సంఖ్యలో ఉంటున్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకోకుండా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి సహజంగా నిత్యం ఐదారుగురు వస్తుంటారు.. ఇదేమి పెద్ద విషయం కాదని అధికారులు, ప్రజా ప్రతినిధులు తొలిదశలో చేతులు దులుపు కొవడానికి ప్రయత్నించి చివరికి తగిన మూల్యం చెల్లించుకుంటున్నారు. గుంటూరులోని వివిధప్రాంతాల్లో తాగునీరు కలుషితంపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడిందని అధికారులు ఆలస్యంగా గుర్తించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన బాధ్యతలను ఇంజనీరింగ్ అధికారులు విస్మరిస్తున్నారు. మురుగు కాల్వల పక్కనే తాగునీటి పైపు లైన్లు ఉండటం వల్ల పైపులు లీకైనప్పుడు వాటిల్లోకి మురుగునీరు చేరి నీరు కలుషితం అవుతుందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. కానీ సమస్య ఉత్పన్నం అయినప్పుడు పైపులైన్లు మార్చడం తప్ప నగరంలో చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ పాత పైపు లైన్లు కొనసాగడం, మురుగుకాల్వల్లోనే పైపు లైన్లు ఉంచడంపై తగిన చర్యలు తీసుకోవడం లేదు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో 204 కుళాయిలు మురుగు నీటిలోనే ఉన్నాయని గుర్తించారు. వీటిల్లో 170 ఇటీవల తొలగించారు. శారదా కాలనీలోని 10 లైన్లలో పాత పైపు లైన్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని గుర్తించారు. మురుగునీటి కాల్వల పక్కనే తాగునీటి పైపు లైన్లు తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది. నగరంలోని శారదాకాలనీ, శ్రీనగర్, బొంగరాల బీడు, సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్డు, వేళంగణీనగర్, ఐపిడి కాలనీల్లోనే ఎక్కువగా ఈ సమస్యలు వెలుగుచూశాయి. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రూ.460 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో రక్షిత నీటిపథకాన్ని గుంటూరు కార్పొరేషన్‌కు మంజూరు చేశారు. పనులు పూర్తయినా ఇంత వరకు నీటి సరఫరాలో తరచూ లీకేజిల సమస్యలే ఉత్పన్నమవుతున్నాయి. 2019లో కొత్తపైపు లైన్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నా కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ పాత పైపు లైన్లు కొనసాగుతున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం వల్ల పైప్ లైన్ లీకులు, సైడ్ కాల్వల్లో, సమాంతరంగా ఉన్న పైప్ లైన్లను, నీటి కుళాయిలు ఉండటం వల్ల నీరు కలుషితం అవుతుందని ఉన్నతాధికారులు నిర్ధారించారు.

రిజర్వాయర్లను సకాలంలో శుభ్రపర్చకపోవడం, డ్రైన్లలో తాగునీటి పైపు లైన్లు కొనసాగుతున్నా స్పందించడం లేదు. అంతేగాక క్షేత్రస్థాయిలో వాల్ ఆపరేటర్లు, ఫిట్లర్‌లు, రిజర్వాయర్ల ఇన్‌చార్జిలపై ఎఈ, డిఈలకు పట్టుఉండటంలేదు. వీరంతా ఇంజినీరింగ్ విభాగంలో నిర్మాణ పనులపై చూపే ఆసక్తి తాగునీటి సరఫరాపై పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా తెనాలిలో డయేరియా ప్రభలి బండి లక్ష్మీ (60) మృతి చర్చనీయాంశంగా మారింది. తెనాలిలో రూ.100కోట్లతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకం నిర్వహణాలోపం కారణంగా నీరు కలుషితమైందనే విమర్శలు వచ్చాయి.

(ఎ.వి.డి.శర్మ)


మాట్లాడుతున్న దేవానందరెడ్డి

చదువు ద్వారానే ఉన్నతంగా భవిష్యత్తు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి ఒక్క విద్యార్థి తమ భవిష్యత్తును ఉన్నతంగా మలచుకునే శక్తి విద్యకు ఉందని గ్రహించి కషిచేస్తే జీవితంలో గొప్పగా స్థిరపడవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక భాష్యం రామసేతు క్యాంపస్‌లో పదో తరగతి విద్యార్థులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ సలహాలు, సూచనలు అందజేశారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదవగలిగితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. లేనిపోని అపోహలు, భయాలను విడనాడి కష్టపడి చదివితే పరీక్షల్లో అనుకున్న ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులు ఈ వయసులో ఏది మంచి చెడు, ఏది చెడు అన్న విచక్షణతో మెలుగుతూ సరైన నిర్ణయాలు తీసుకుంటే భావి జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఇరువురూ సమన్వయంతో విద్యార్థులకు సరైన దిశానిర్దేశం చేయాలని సూచించారు. విద్యార్థులు పరీక్షల వేళ ఆందోళనను దరిచేరనీయకుండా విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సన్నద్ధమైతే అనుకున్న ఫలితం వస్తుందన్నారు. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు అందిస్తున్న సూచనలు పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో రామసేతు ప్రిన్సిపాల్ షఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, చిత్తు పేపర్లు, పనికిరాని వివిధ రకాల చెత్తను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేకరించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజారవాణా అధికారి రవికాంత్ మాట్లాడుతూ విద్యార్థులు వారి చదువుతోపాటు, సామాజిక బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటితోపాటు, బయట మన చుట్టూ ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూత్ అధికారి సంజయ్, డిపో మేనేజర్లు అబ్దుల్ సలాం, రామకష్ణ, ఏ.ఓ.పవన్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కె.సత్య నారాయణ, జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్. జె.వి.సుధీర్‌కుమార్ వివిధ కాలేజిల విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు